గ్రామాల్లో మార్మోగుతున్న శ్రీరామ నామం



ఇంటింటా అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

పెగడపల్లి: అయోధ్యలో శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన ఈనెల 22న జరగనున్న నేపథ్యంలో అయోధ్య రామ మందిర తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామివారి అక్షింతలకు భక్తులు ఘనంగా శోభాయాత్ర చేపడుతున్నారు. శ్రీరామనామ జపంతో ఇంటింటికీ అక్షింతలను అందిస్తున్నారు. దేవాలయాల్లో రామ సంకీర్తనలు, రామభజనలు ఆలపించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇంటింటికీ పంపిణీ చేసిన అక్షింతలను భక్తులు దేవుని పూజ మందిరంలో పెట్టుకుంటున్నారు. 22న అయోధ్యలో శ్రీబాల రాముల విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న సమయంలో ఇంటిల్లిపాది తలస్నానం చేయడం.. గ్రామంలోని దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేయడం మంచిదని ట్రస్టు సభ్యులు చెబుతున్నారు.

పూర్వ జన్మసుకృతం



అయోధ్య రాములవారి అక్షింతలను ఇంటింటికీ పంచే అవకాశం రావడం నిజంగా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. నిజంగా దైవ సేవ కార్యక్రమాలు చేయడం ద్వారా మనస్సు అత్యంత పరమపవిత్రంగా ఉంది. ఆయా అనుభూతి వెలకట్టలేనిది.

– జడల రాజేశం, అయోధ్య తీర్థ ట్రస్టు మండల ఇన్‌చార్జి

కల నెరవేరుతుంది



అయోధ్యలో శ్రీరాముడి గుడి నిర్మాణం జరగడం సంతోషంగా ఉంది. అక్కడి నుంచి వచ్చిన అక్షింతలను చూస్తుంటే శ్రీరాముడే ఇంటికి వచ్చినట్లు ఉంది. వాటిని ఇంటింటికీ వితరణ చేస్తుంటే శ్రీరామనామం ప్రజ్వలిస్తోంది.

– కాటం నర్సింహారెడ్డి, కరసేవకుడు

కార్యకర్తల కోరిక మేరకు ఎంపీ వాల్ రైటింగ్



వాల్‌రైటింగ్ చేస్తున్న బండి సంజయ్

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మయ్యపల్లిలో బుధవారం బీఆర్ అంబేద్కర్,శివాజీ,బతుకమ్మ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల కోరిక మేరకు గోడ మీద కమలం బొమ్మ గీసి నరేంద్ర మోదీ పేరు రాసి అభిమానులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ డబ్బు రాధ, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరిలో చీడపీడలపై జాగ్రత్త వహించాలి



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: వరిలో చీడపీడల పట్ల జాగ్రత్త వహించాలని మెట్‌పల్లి మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీ అన్నారు. మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల,కోనరావుపేట గ్రామాల్లో పలువురు రైతులకు చెందిన వరి పంటను పరిశీలించిన అధికారులు వరికి చీడపీడ ఉన్నట్లు గుర్తించారు. వరిలో మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల నష్టం కలిగే అవకాశాలున్నాయన్నారు. మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న పొలంలో కార్టపి హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 నుంచి 10 కిలోలు లేదా క్లోరాంట్రినిప్రోల్ 0.4 శాతం జీ గుళికలు 4 కిలోలు పొలంలో చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో భూమేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణ



కార్యాలయ పరిసరాల్లో సంచరిస్తున్న పందులు

మేడిపల్లి: పచ్చదనం, పరిశుభ్రత పాటించాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారు, కానీ వారే ఆచరణలో పెట్టరు.. దీనికి నిదర్శనమే మండల ప్రజా పరిషత్ కార్యాలయం. మండల కేంద్రంలో ప్రజా పరిషత్ కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు పెరగటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. దీంతో వరాహాల స్వైరవిహారంతో పరిసరాలన్నీ తీవ్ర దుర్గంధం వస్తున్నాయి. పందులు ఎక్కువ మొత్తంలో సంచరించటంతో ఆ ప్రాంతమంతా బురదగా మారి దోమల బెడద ఎక్కువైంది. కార్యాలయానికి వచ్చినవాళ్లు వాసనతో ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఇలా జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల జిమ్ ప్రారంభం



జిమ్ ప్రారంభిస్తున్న క్రీడాకారిణి శారద

కోరుట్ల: మహిళల దేహధారుద్యానికి జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఇంటర్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి గొట్టి ముక్కల శారద అన్నారు. పట్టణంలో బుధవారం మహిళల మై ఫిట్ క్లబ్ జిమ్ ప్రారంభించారు. సందర్భంగా కరీంనగర్ జిల్లాలకు చెందిన పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల క్రీడాకారుల బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహించారు. బాడీ వెయిట్‌లో వివిధ కేటగిరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు జిమ్ నిర్వాహకుడు ఉరుమడ్ల చరణ్ బహుమతులు అందజేశాడు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల నాగరాజు, గాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా వరప్రసాద్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో బుధవారం పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడాల వరప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా నాయిని కాలిదాసు, ప్రధాన కార్యదర్శిగా బూస అజయ్, కోశాధికారిగా బూస దేవరాజ్, గౌరవ అధ్యక్షుడిగా బూస రమేశ్, ప్రధాన సలహాదారుడిగా చిలివేరి వెంకట్, జోగ ధనుంజయ్, చిలివేరి శ్రీనివాస్, వేముల శ్రీహరి, సంఘ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాపెల్లి సురేష్, జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చాట్ల గణేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

మరమ్మతులు చేయాలని వినతి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్దచెరువు మత్తడి,పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యాం లీకేజీ మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

శ్రీరామదీక్షల స్వీకరణ



శ్రీరామదీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

జగిత్యాలటౌన్: అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని హరిహర ఆలయంలో శ్రీరామ దీక్షలు ప్రారంభయ్యాయి. శ్రీరామసేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం భక్తులు శ్రీరామదీక్షలు స్వీకరించారు. 8 రోజుల పాటు కొనసాగనున్న శ్రీరామ దీక్షలో ఈనెల 24న భక్తులు దీక్ష విరమణ చేయనున్నారు. కార్యక్రమంలో యాదా రామకృష్ణ, చిట్ల గంగాధర్, వీహెచ్‌పీ నాయకులు అరుణ్‌కుమార్, గాజోజు సంతోష్, బిట్టు, దీక్షాస్వాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బల్మూరి వెంకట్ స్వగ్రామంలో సంబరాలు



స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న గ్రామస్తులు

మల్యాల: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బల్మూరి వెంకట్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో బుధవారం వెంకట్ స్వగ్రామం మానాలలో గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించిన వెంకట్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై గ్రామస్తులు ఎడిపెల్లి తిరుపతి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి, హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో మునీందర్, మహేశ్, జువ్వాజి రాంరెడ్డి, లింగంపల్లి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి వైకుంఠ రథం వితరణ



దాతలను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామానికి స్థానిక రైస్ మిల్లర్ కొత్త గణేశ్, కొత్త శ్రీనివాస్ దంపతులు గ్రామానికి వైకుంఠ రథాన్ని బుధవారం వితరణ చేశారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ రథాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, సర్పంచ్ చెప్యాల నర్సయ్య దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగారపు సాగరికా, కార్యదర్శి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, నాయకులు చీటి వెంకట్రావు, వాసవి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో స్వచ్ఛ తీర్థ ప్రచారం



ఆలయం శుభ్రం చేస్తున్న యువకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణ పరిధిలోని ఎఖీన్‌పూర్‌లోని సాయిబాబా ఆలయంలో బుధవారం స్వచ్ఛభారత్ మిషన్ కింద స్వచ్ఛ తీర్థ ప్రచారం నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు దేశంలోని ప్రముఖ ఆలయాలు, పుణ్యక్షేత్రాలు, ఆలయాలు, ప్రార్థన మందిరాలను శుభ్రపరుచుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ కోరారు. దీంతో పట్టణంలోని పలువురు యువకులు సాయిబాబా ఆలయ పరిసరాలు శుభ్రం చేశారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మల్యాల: మండలంలోకి నూకపల్లి గ్రామానికి చెందిన బండారి కేశవరావు బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేశవరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట వెల్మ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

రోళ్లవాగు కాల్వ పూడికతీత పనులు ప్రారంభం



కాల్వలో పూడికతీస్తున్న జేసీబీ

జగిత్యాలరూరల్(సారంగాపూర్): బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్ట్ మెయిన్ కాలువ మరమ్మతు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రోళ్లవాగు మెయిన్ 2 ఎల్ కాలువలో నీరు రాకుండా పూడిక ఉండటంతో జేసీబీ సాయంతో కాలువలో ఉన్న పూడికను తీసివేశారు. దీంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందించేలా కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మల్లాపూర్: బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాఘవపేట, వేంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు సంజీవ్‌రెడ్డి, రాఘవపేట గ్రామానికి చెందిన బైరి రవికుమార్‌యాదవ్ తల్లి యమున మరణించగా, బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజనఆదిరెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, సర్పంచ్‌లు బిట్ల సరోజన, నత్తి లావణ్య, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, నాయకులు పాల్గొన్నారు.

సెంట్రల్ స్కూల్ కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహమూర్తి

రాయికల్: మండలంలోని బోర్నపల్లిలో సెంట్రల్ స్కూల్ కోసం బుధవారం జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి గుట్ట వద్దనున్న భూమిని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఈ స్కూల్ నిర్మాణం కోసం సుమారు 10 ఎకరాల భూమి అవసరం ఉందని, సంబంధిత భూ వివరాల నివేదిక అందజేయనున్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఖయ్యూం, సర్పంచ్ పాదం లత రాజు, ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఆర్ఐలు దేవదాసు, పద్మయ్య ఉన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి దివ్యశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, సర్పంచ్ పిడుగు లావణ్య, ఉపసర్పంచ్ సుధాకర్, ఏఎన్ఎం ,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు



వంటసామగ్రి పరిశీలిస్తున్న అనూష

మెట్‌పల్లి: హోటళ్లు, రెస్టారెంట్లల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ అనూష అన్నారు. పట్టణంలోని ఆర్‌బీ రెస్టారెంట్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్‌తో పాటు పదార్థాల తయారీకి వినియోగిస్తున్న వస్తువులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశుభ్రతను పాటించాలని, పదార్థాల తయారీకి నాణ్యమైన వస్తువులను వినియోగించాలన్నారు. లేకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేటలో బుధవారం గ్రామపంచాయతీ పంప్ ఆపరేటర్ పుప్పాల గంగారెడ్డి(50) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జోగుల మమత, ఉపసర్పంచ్ కోడిమ్యాల రవి, పంచాయతీ కార్యదర్శి సురేశ్, వార్డుసభ్యులు జలపతి, నారాయణ, హైమత్, కాశీం, నాయకులు జోగుల రాజేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియలకు గ్రామపంచాయతీ నుంచి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత



బొమ్మెన- గంభీర్‌పూర్ గ్రామాల మధ్య గుంత

కథలాపూర్: మండలంలోని బొమ్మెన-గంభీర్‌పూర్ గ్రామాల మధ్య రోడ్డుపై గుంత ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రజలు తెలిపారు. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు పక్కన గుంత ఏర్పడి... ఇటీవలే అది మరింత ప్రమాదకరంగా మారిందని ప్రజలు పేర్కొన్నారు. అధికారులు చొరవ చూపి మరమ్మతులు చేయించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళలు

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో వసుంధర మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం మహిళా సాధికారత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలకి మిషన్ శక్తి స్కీం , మహిళా సాధికారత, 181, సఖీ, 1098 –చైల్డ్ హెల్ప్‌లైన్, వివిధ హెల్ప్‌లైన్‌లపై అవగాహన కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలని, 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు పింఛన్ రాకపోయినా, ఇంట్లో పిల్లలు తల్లిదండ్రులను బాగా చూసుకోకపోయినా, 14567 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వికలాంగుల పింఛన్ల సదరం సర్టిఫికెట్ల కోసం, ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి 155326 హెల్ప్ లైన్ నెంబర్‌కి ఫోన్ చేయాలన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళ సాధికారత జెండర్ స్పెషలిస్ట్ గౌతమి, ఫైనాన్షియల్ లిటరసీ హేమశ్రీ, సఖి లీగల్ అడ్వైసర్ లావణ్య, సఖి సోషల్ వర్కర్ శారద, ఏఏలు రాధ, లావణ్య పాల్గొన్నారు.

రేషన్‌షాపుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్ఐలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామాల్లో 20 రేషన్‌షాపులను బుధవారం రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్‌షాపులను ఎవరైనా బినామీ డీలర్లు నడిపిస్తున్నారా, అసలైన డీలర్లు నడిపిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి సరాఫరా అయ్యే రేషన్‌బియ్యం రికార్డుల ప్రకారం పంపిణీ చేస్తున్నారా, తూకంలో లోపాలు ఉన్నాయా రికార్డులను సరిగ్గా నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. పై అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఆర్ఐలు రమేశ్, గంగాధర్ తెలిపారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్

కథలాపూర్: గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, సైబర్ మోసాలపై ఆట పాటలతో కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, సర్పంచ్ కోలి వసంత, ఉపసర్పంచ్ నరేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను బకాయిలు చెల్లించండి

- మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్

కోరుట్లటౌన్: 2023–24 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను బకాయిలు పట్టణ ప్రజలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ బుధవారం పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంటి పన్ను బకాయిలపై అపరాధ రుసుం మాఫీ ఇవ్వలేదని, 2023–24 ఆర్థిక సంవత్సరం మార్చి 31 వరకు పూర్తవుతుందని తెలిపారు. ప్రజలు ఇంటికి సంబంధించి ఇంటి పన్ను (ఘర్ పట్టి),నల్లా బిల్లులు, అడ్వర్‌టైజ్‌మెంట్, ఎంక్రోచ్‌మెంట్, లైసెన్స్ ఫీజులు మున్సిపల్ అధికారులకు చెల్లించాలని తెలిపారు. నూతన షాప్ లైసెన్స్, పాత షాపు లైసెన్స్‌ల (రీనివల్) మీ సేవా కేంద్రాల్లో, సంబంధిత మున్సిపల్ అధికారులకు వెంటనే చెల్లించి, రశీదు పొందాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో పన్ను బకాయిలు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల: బీఆర్ఎస్ నాయకుడు విష్ణు కుమారుడు అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నాణ్యమైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులను కోరారు. ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అండగా కాంగ్రెస్

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వంలో మంత్రులను కలువలేని ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రిని కలువలేని మంత్రులు ఈ రోజు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కలువడం స్వాగతిస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ద్వారా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్‌ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీర్‌పూర్‌లో ఫిల్టర్‌బెడ్‌ను ప్రారంభించిన ఘనత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు మండల స్థాయి అధికారులతో సమావేశం

పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వివిధ శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయ భూమి లీజుకు వేలం

జగిత్యాలటౌన్: పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం(ధర్మశాల)కు చెందిన సర్వేనంబర్ 171లోని సుమారు రెండెకరాల విస్తీర్ణంలోని భూమి ఒక ఏడాది కాలపరిమితి వరకు సర్కస్, ఎగ్జిబిషన్ల నిర్వహణ కోసం లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి వేణు గోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిషన్, సర్కస్‌ల నిర్వహణకు ఎగ్జిబిషన్ ఫాం రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న వ్యక్తులు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31 బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.3 లక్షల డిపాజిట్ సొమ్ము డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించేందుకు ఈనెల 19న ఉదయం 10–30 గంటల నుంచి మధ్యాహ్నం 2–00 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బింగి సత్యమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని వరుణ్ మోటార్స్, జగిత్యాలలోని శ్రీరాం చిట్‌లలో గల ఖాళీల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డీజిల్ మెకానిక్, బీటెక్ లేదా మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా ఉన్న వారు అర్హులని తెలిపారు. డ్రైవర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెక్నికల్ అడ్వైజర్ పోస్టులకు 2 నుంచి 3 ఏళ్ల అనుభవం ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఎర్దండిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు కరీంనగర్ రేకుర్తికి చెందిన కంటి వైద్యులు పరీక్షలు చేస్తారని, గ్రామస్తులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.